అతలాకుతలం!

గడచిన వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. జన జీవనం స్తంభించింది. కొన్ని చోట్ల రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వృక్షాలు విరిగిపడటంతో కొన్ని చోట్ల ఇళ్లు, మరికొన్ని చోట్ల విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురి కాగా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



అరవింద్‌నగర్, పూల్‌బాగ్‌లలో హుస్సేన్‌సాగర్ నాలాలో వరదను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

- విరిగిన చెట్లు, విద్యుత్ సరఫరాకు అంతరాయం
- హుస్సేన్‌సాగర్ నాలా ప్రభావిత ప్రాంతాల్లో భయంభయం
- వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటన

ముషీరాబాద్: భారీ వర్షాలతో వరద నీరు ఎక్కడిక్కడ నిలిచిపోకుండా సాఫీగా నీరు నాలాల్లో వెళ్లేందుకు కృషి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. దీంతోపాటు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతాలైన కవాడిగూడ, అరుంధతీనగర్, సబర్మతీనగర్, అశోక్‌నగర్, అరవింద్ కాలనీ, పూల్‌బాగ్, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి హుస్సేన్‌సాగర్ నాలా వరద ఉద్రిత్తిని అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

- అడిక్‌మెట్ డివిజన్ నాగమయ్యకుంట, సాయిచరణ్ కాలనీ, పద్మాకాలనీ, అచ్చయ్యనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బండమైసమ్మ నగర్‌లో కూలిన ఇంటిని పరిశీలించారు.

విరిగిపడ్డ భారీ వృక్షం...

- భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో భారీ వృక్షం ఎడతెరిపి లేని వర్షాలతో నెలకొరిగింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో తీగలు తెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు కొన్ని గంటల పాటు అంతరాయం ఏర్పడింది. స్థానికుల ఫిర్యాదుతో డిజాస్టర్ బృందాలు వచ్చి చెట్టుకొమ్మలను తొలగించగా విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టారు.



అరుంధతీనగర్‌లో తన పిల్లలను ఎత్తుకుని వరదలో వెళ్తున్న ఓ తండ్రి

- ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ బాప్టిస్ట్ చర్చి వీధిలో వరద నీరు పొటెత్తి రాకపోకలకు కొన్ని గంటల పాటు అంతరాయం ఏర్పండి.
- ముషీరాబాద్ ప్రధాన రహదారిలోని సందర్శిని హోటల్, రాజా డిలక్స్ వద్ద వరద నీటితో పాటు మురుగు నీరు పెద్ద ఎత్తున రోడ్డుపై చేరడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు లోనైయ్యారు.
- దయారామార్కెట్ నుంచి హరినగర్‌లోని వైట్ హౌజ్ హోటల్ వరకు డ్రైనేజీ పైపులైన్ పనుల కోసం రోడ్డు తవ్వడంతో ఆదారిలో మొత్తం నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.
- అడిక్‌మెట్ డివిజన్ పద్మాకాలనీలో నాలా విస్తరణ కోసం తవ్వడంతో ఆ పనులు నిలిచిపోయి అందులో వర్షం నీరు చేరి ఆ కాలనీ వాసులు ఇంట్లో నుంచి బయటకు రావడం కష్టతరంగా మారింది. ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు కింద చేపట్టిన ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మిక కమిషనరేట్ ప్రధాన గేట్ల వద్ద...



చిక్కడపల్లి: కార్మికశాఖ కమిషనరేట్ ప్రధాన గేటు వద్ద వరద నీరు చేరడంతో కార్యాలయానికి వచ్చే సిబ్బంది, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా వర్షం పడుతుండటంతో కార్యాలయంలోకి వెళ్లే రెండు ప్రధానగేట్ల వద్ద మోకాలిలోతు నీరు చేరింది. అయితే కమిషనరేట్ ఎస్టేట్ ఆఫీస్ యంత్రాంగం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది.

అరుంధతీనగర్‌లో...

- గాంధీనగర్ డివిజన్ అరుంధతీనగర్ బస్తీలో వరద నీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మోకాలిలోతు నీరు బస్తీలోని రోడ్లపై నిలిచిపోవడంతో స్థానికులు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. చిన్నపిల్లలను ఎత్తుకుని రోడ్డుపై వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని బస్తీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద వరద

అరుంధతీనగర్‌బస్తీలో వరద సమస్యలను పరిష్కారిస్తా

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతీనగర్ బస్తీలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, ఇరిగేషన్ ఈఈ శంకర్, ఏఈ శ్యామ్ సుందర్, జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్‌సలామ్‌లతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఉస్సేన్‌సాగర్ నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మించడంతో పరీవాహక బస్తీ ప్రజలకు ముప్పు తప్పిందన్నారు. అరుంధతీనగర్ బస్తీలో ప్రధాన ర్డోడు పై నుంచి కచ్చామోరీలో వరద నీరు వస్తుందని తెలిపారు. అరుంధతినగర్‌లో నెల కొన్న వరద నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నాయకులు ముఠా నరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, రాజ్‌కుమార్, గడ్డమీది శ్రీనివాస్, శ్రీకాంత్, హనుమంతు, కృష్ణ, జి.వై.గిరి, సరస్వతి, చందు, రమేశ్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



బస్తీలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహ

'పేదరిక నిర్మూలన ఇప్పుడే గుర్తుకొచ్చిందా'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాల పరిపాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గుర్తుకు రాని పేదరికం నిర్మూలన ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని రిపబ్లికన్ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య విమర్శించారు. ఎన్నికల సమయంలో బీసీలకు, ముస్లి, క్రిస్టియన్‌లకు ఒకొక్క కుటుంబానికి లక్ష రూపాయలు అందించి పేదరిక నిర్మూళన చేస్తామని చెప్పడం సిగ్గుచెటు అన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా గుర్తుకు రాని పేదలు ఇప్పుడు ఎలా గుర్తుకు వచ్చారని ప్రశ్నించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జన్ను సాంబయ్య మాట్లాడుతూ లక్ష రూపాయలు ఇచ్చి ఇక ఇంట్లో ఎంత మంది ఉంటే అన్ని ఓట్లు గుండుగుత్తగా దండుకోవడానికే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఓట్లను కోనుగోలు చేసే ఎత్తుగడలో భాగంగానే పేదరిక నిర్మూలన పేరుతో బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నారని విమర్శించారు. బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నారు తప్ప పాలకులుగా చూడటం లేదన్నారు. తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా పేదరిక నిర్మూళన ఎలా సాధ్యం అవుతుందన్నారు. ఉపాధి అవకాశాలను దెబ్బతీసి లక్ష రూపాయలతో చేతులు దులుపుకొని మరోమారు అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని కేసీఆర్ కుటిల ప్రయత్నాన్ని బీసీలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ డిమాండ్

కాచిగూడ: మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలు, హత్యలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ డిమాండ్ చేసింది. గురువారం వైఎంసీఏలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ రాధ మ్యాథ్యూస్, బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్, ఎ.కె.గిడియోను బాబు మాట్లాడుతూ... మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం మెజారిటీ మైతీ ప్రజల్ని మతతత్వంతో ప్రేరేపిస్తూ మైనారిటీ గిరిజన కుకీలపై హత్యాకాండ సాగిస్తోందని ఆరోపించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని, అన్ని హింసాత్మక సంఘటనలపై సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ నేహెమియా, డి.ఆదంరాజు, డాక్టర్ సాదు సత్యనాథ్, సుక్క కన్నా డానియల్, వైయోలో, గ్రేస్, రెవరెండ్ కిరణ్ పాల్, శాంతి ప్రియా, డాక్టర్ మమత, డాక్టర్ జాన్‌బాబు, సునందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నేతలు

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధచూపాలి



బీపీ చెక్ చేయించుకుంటున్న అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్

చిక్కడపల్లి: కార్మికశాఖ ఉద్యోగులు తమ ఆరోగ్యం గురించి తగు జాగ్రతలు తీసుకోవాలని కార్మిక శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్ సూచించారు. హెచ్‌డీఎఫ్‌సీ పర్యేవక్షణలో సికింద్రాబాద్ మెడికవర్ ఆస్పత్రి వారు ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక కమిషనరేట్‌లో గురువారం ఉచిత బీపీ, షుగర్ పరీక్షల వైద్యశిబిరం నిర్వహించగా బంజారాహిల్స్‌కు చెందిన సెంటర్ ఫర్ సైట్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను చేయించుకుని శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆరోగ్యరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనరేట్‌లోని దాదాపు ఎనభై మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక ఎసీఎల్ యమునాయాదవ్, వైద్య సిబ్బంది సునీల్ కుమార్, పూజ, అఖిల, ప్రవీణ్, కేశవ్, వినయ, ప్రీతమ్‌రాజేంద్రమోహతా, రాకేష్‌సుత్రవె, సాయికుమార్, పవన్‌కుమార్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్ సమాచారం మేరకు... గుర్తుతెలియని మహిళ(50) ఉప్పుగూడ–ఫలక్‌నుమా స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ సమాచారం మేరకు... గుర్తుతెలియని వ్యక్తి కాచిగూడ–విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోల్నాక మార్కెట్ వద్ద పేలిన ట్రాన్స్‌ఫార్మర్

నల్లకుంట: భారీ వర్షాలకు తోడు ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడుతో గురువారం మధ్యాహ్నం నల్లకుంట గోల్నాక మార్కెట్ ఖార్జాన గల్లీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలిపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ప్రజలెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో స్థానికులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయంపై సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అమృత అక్కడకు చేరుకుని విద్యుత్ శాఖ సాయంత్రం 5 గంటల సమయంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మ్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

చిత్రసీమలో నేపథ్యగాయని చిత్రకు ప్రత్యేక స్థానం



నిత్యసంతోషిణిని సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: తెలుగు చలన చిత్ర పరిశ్రమలో గొప్ప గాయనిగా చిత్ర పేరుగాంచారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయ గాన సభలో ప్రముఖ సినీ నేపథ్యగాయని పద్మభూషణ్ కృష్ణన్ నాయర్ శాంతకుమారి చిత్ర (కె.ఎస్.చిత్ర) 60వ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర గీతాల సంగీత విభావరి వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త, ఎస్‌బీఐ డీజీఎం గరికపాటు వెంకట్ సినీ నేపథ్యగాయని, నంది అవార్డు గ్రహీత నిత్యసంతోషిణిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు చంద్రశేఖర్ గౌర్తి, నేపథ్య గాయకులు వినోద్‌బాబు, సుబ్రహ్మణ్యం, పవన్ ఉమాపతి, భరద్వాజ్, సుమన్‌కుమార్, సంధ్య ఉమాపతి, నవీన్ తుమ్మల, శ్రీకాంత్ చిలువేరు, కార్తికేయ, సుమన్, తరుణ్ రాఘవేంద్ర, సుజాత, లక్ష్మీగాయిత్రి, శ్రుతి, శ్రీధృతి, మోహన, లేఖ్య, ముగ్ధ, సింధు, సాహితీ, శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

అంబర్‌పేట: వర్షాలకు తలెత్తుతున్న సమస్యలపట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ సూచించారు. గురువారం డివిజన్‌లోని తిరుమలనగర్‌లో వర్షానికి కూలిన చెట్టును ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. కూలిన చెట్టును తక్షణమే తొలగించి స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించాలని తెలిపారు. అలాగే చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు.



తిరుమలనగర్‌లో కూలిన చెట్టును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మొహర్రం వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పద్మావతీరెడ్డి

అంబర్‌పేట: మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురువారం బాగ్‌అంబర్‌పేట పాములబస్తీలో ఉన్న దర్గాలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. వేడుకలకు మాజీ కార్పొరేటర్ కె.పద్మావతీ రెడ్డి హాజరయ్యారు. ఆమెను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వహకులు ఖాసీం, సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించడంలో కేటీఆర్ విఫలం

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: నగర ప్రజలకు భరోసాను కల్పించడంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. గురువారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ... ముసారాంబ్రిడ్జిని సందర్శించిన మంత్రి నగర సమస్యలు మాత్రం పరిష్కారం అయ్యేలా కనిపించడం లేదన్నారు. గతంలో వర్షాకాలంలో మంత్రి కేటీఆర్ నగరాన్ని సందర్శించినా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని గుర్తు చేశారు. గత వారం రోజులుగా నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నా వర్షాల ప్రభావాన్ని అంచనా వేయడంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నా ముంపు బాధితులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయ్యాలనే కనీస ఆలోచన మంత్రి కేటీఆర్‌కు లేదని మండిపడ్డారు. ప్రస్తుతం మూసీ నది పరిసర ప్రాంతాలలో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్న వారికి వెంటనే నిత్యావసర సరుకులను అందించి ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. నగర ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే పట్టించుకోని కేటీఆర్, నగరాన్ని అభివృద్ధి చేశామని మాత్రం గొప్పలు చెప్పుకుంటారని ఆయన ఎద్దేవా చేశారు. సమావేశంలో నేతలు ఉమారాణి, శ్యాంసుందర్, బండా కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గౌతంరావు

యూసీసీతో లింగ సమానత్వం

నల్లకుంట: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) భారత దేశానికి ఎంతో అవసరమని, దీని వల్ల దేశం ఐకమత్యంతో ముందుకు వెళ్లే అవకాశం, లింగ సమానత్వం ఏర్పడుతుందని నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. గురువారం నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూసీసీ ఆవశ్యకతపై పాత నల్లకుంటలో ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... యూసీసీతో మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు, సమాన హక్కులు లభిస్తాయని తెలిపారు. రాజకీయ కారణాతో ఉమ్మడి పౌర స్మృతిపై అసలైన చర్చలు తగ్గిపోతున్నాయన్నారు. నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పీఎస్ చారీ, మధు యాదవ్, శ్రీనివాస్, గంటా లక్ష్మణ్, గోపి, కె.ఎం.దినేష్, శ్రవణ్ యాదవ్ పాల్గొన్నారు.

రైళ్లపై రాళ్లు రువ్వితే చర్యలు

కాచిగూడ: రైళ్లపై రాళ్లు విసిరే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకొనున్నట్లు ఆర్‌పీఎఫ్ కాచిగూడ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ ధర్మారావు సిబ్బందితో కలిసి యాకుత్‌పురా–డబీల్‌పురా రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌కు ఇరువైపుల ఉన్న బస్తీల ప్రజలను పిలిచి వారికి అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రైలు పట్టాలను ప్రమాదకరంగా దాటేవారితో పాటు వాటిపై నడుచుకుంటూ వెళ్లే వారికి ఆర్పీఎఫ్ కౌన్సెలింగ్ నిర్వహించింది. రైళ్లపై రాళ్లు విసురుతున్న ఇద్దరని ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై రైల్వే చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యం సహకరిస్తేనే మెరుగైన సేవలు

అంబర్‌పేట: ఆరోగ్యం సహకరిస్తేనే విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తమైన సేవలందిస్తారని అంబర్‌పేట పోలీస్ ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ పి.మధుకర్‌స్వామి అన్నారు. గురువారం అంబర్‌పేటలోని ట్రెనింగ్ సెంటర్‌లో లయన్స్‌క్లబ్ గ్రీండ్‌ల్యాండ్స్, కిమ్స్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి మాట్లాడుతూ... దీర్ఘకాలిక వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు సిబ్బందికి ఆర్థో, టూడీఈకో, ఈసీజీ వంటి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందించడం జరిగింది. కార్యక్రమంలో డీఎస్పీలు జి.జగన్, కె.వి.విజయ్‌కుమార్, ఎ.శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, జె.ప్రవీణ్, డాక్టర్ మహేష్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ లక్ష్మీకుమారి, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి తదితరులు

క్లుప్తంగా

రేపు అఖిల భారత మహిళల ప్రార్థన సదస్సు

కాచిగూడ: హోలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్‌లోని ఆమ్‌శ్రీ బిల్డింగ్‌లో అఖిల భారత మహిళల ప్రార్థన సదస్సును నిర్వహించనున్నట్లు అసోసియేషన్ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్, ఎ.కె.గిడియన్ బాబు తెలిపారు. గురువారం నారాయణగూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ... వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు డ్రేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ యుఎస్ఏ అనుబంధంగా నాటాచే గుర్తింపు పొందిన హెచ్ఎస్‌సీ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అఖిల భారత యువజన సమావేశం జరుగుతుందని, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు.

నేటి నుంచి ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సమావేశాలు



మాట్లాడుతున్న రవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈ నెల 28, 29, 30వ తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రవి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేయడంతో పాటు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలక పక్ష పార్టీల వైఖరిని ప్రజలకు వెల్లడిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ప్రజా ప్రత్యామ్నాయ నిర్మాణం కోసం కలిసి వచ్చే శక్తులను సమీకరించి రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కుంభం సుకన్య, తుకారామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోండి



పర్వతీష్‌బాగ్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: వర్షపు నీరు నిలవకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలుమార్లు అధికారులకు సూచించినా ఫలితం లేకపోవడంతో స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నేతలు తిరుపతి, ఓంప్రకాష్, బి.భీమ్‌రాజ్, రవియాదవ్, సూరి, రామకృష్ణ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ప్రకారం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఆదివాసీ కుటుంబానికి పోడు భూముల హక్కుల పత్రం ఇచ్చి యాజమాన్య హక్కులను కల్పించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాఫ్రంట్(టీపీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివాసీలకు ఎలాంటి షరతులు లేని పోడు భూముల పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ... పోడు భూమితో సంబంధం లేకుండా ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి గురిజన బంధు ఇవ్వాలని, హక్కులు పొందిన పోడు రైతుల పొలానికి ఉచితంగా బోర్లు వేసి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి తెలంగాణలో స్థిరపడిన గొత్తి కొయలకు సరిహద్దుతో సంబంధం లేకుండా ఆధార్ కార్డు, ఉచిత రేషన్ కార్డుతో పాటు పోడు భూమి హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. పోడు భూములకు హక్కులు పొందిన రైతు పొలాలకు సరైన హద్దులు గుర్తించాలని డిమాండ్ చేశారు. టీపీఎఫ్ కన్వీనర్ భూషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎంఎస్ కన్వీనర్ బి.జ్యోతి, కుల నిర్మూలన పోరాట సంఘం నాయకులు ఎం.లక్ష్మీనారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.